

# పతిత

'వాసంతి'

**మనుష్యులు** పుడుతుంటారు; చస్తుంటారు. అందులో కొందరు, వారికి సంబంధించిన కొంత చరిత్రను కథలుగా చెప్పుకోమని భూమిమీద విడిచిపోతుంటారు. ఆ చరిత్ర మంచిదై ఉండవచ్చు; చెడ్డదై ఉండవచ్చు. మంచిచెడ్డల కలయికై ఉండవచ్చు. కొందరికి వారు ఒకానొకప్పుడు ఈ భూమిమీద ఉన్నారా? లేరా?—అని విచారించేందుకు కూడా నిదర్శనాలు లేకుండా పోతుంటాయి.

లలిత నిగర్వి. కరుణారసపూరిత హృదయ. ఆ ఊళ్లో లలితను, ఆమె అలవాట్లను అనుకరించడానికి ప్రయత్నించిన పద్దెనిమిదేండ్ల సమవయస్కులు విఫలులై, పులిని చూసి నక్క వాత బెట్టుకున్నట్టుగా ఎంచుకొని, విరమించుకొని, లోలోన ఆమె స్వభావ సౌరభ్యాలను ప్రశంసించి, పైకిమాత్రం చీదరించుకునే వాళ్లు. అసూయతో ద్వేషించేవాళ్లు. లలిత అమాయకమైన, నిశితమైన చూపులు ఎంత ద్వేషం కలవారినైనా ఇట్టే ఆకట్టేస్తాయి;

*ఒకరి సహాయం లేనిదే జీవించలేని పురుషుడు, స్త్రీని ఆకర్షిస్తాడు; ప్రేమకు పాత్రుడు అవుతాడు. కాపాడగలదు స్త్రీ—అదే కారణమేమో.*

---

ఆమెతో స్నేహం చేయాలనిపిస్తాయి. అదే ఆమెలో ఉండే ప్రతిభ.

గ్రామంలో కొందరు లలిత తల్లితో అంటార.— "లలిత మన గ్రామంలో మీ యింట తప్పపుట్టిందమ్మా" అని.

తల్లి మురిసిపోయేది.

లలిత గొప్పతనాన్ని చాటేందుకు మరో విశేష ముంది. ఆమె కంఠంలో వేయి వేణు వాదాలు వినిపిస్తాయి. కోటి వీణా తంత్రీ నిస్వనాలు వినిపిస్తాయి. ఆమె మృధుమధుర కంఠాన్ని విన్న ప్రతివారూ ఆమెకు సంగీతంలో ప్రోత్సాహమిచ్చారు. తనకుండే అభిలాషచేత నైతేనేమి, శ్రద్ధచేత నైతేనేమి కొద్దికాలంలోనే సంగీతంలో పరిపూర్ణ పరిజ్ఞానాన్ని సంపాదించుకొంది లలిత.

లలిత సంగీతం నేర్చుకొనేటప్పుడే గ్రామంలోని చిన్నా పెద్దా అంతా నాగస్వరానికి తలలూచే నాగుల్లా చెవులు రిక్కపొడుచుకొని తన్మయులై వింటుండేవారు. సంగీత సాధనకు తన యిల్లు అంత సరిపోయిందిగా తోచలేదు. ఏకాంత ప్రదేశాలకు పోయి, అక్కడ హాయిగా పాడుకుంటే బావుండేది అనుకునేది లలిత. ప్రకృతి సౌందర్యానికి పెట్టిన పేరుతో ప్రకాశించే ఆ ఊరులో, ఆమెకు ప్రశాంత ప్రదేశం దొరక్కపోలేదు. ఊరికి ఆవల సెలయేరుంది. చుట్టూ చెట్లతోపు లున్నాయి. నిర్జనప్రదేశం. నిర్మల వాతావరణం. అంతకన్నా ఆమె కేంకేం కావాలి?

సాయంసమయమంతా సెలయేటి ఒడ్డున సంగీత సాధనతో గడిపి, ఇంటికి తిరిగి వస్తూ ఉండేది. కణ్వమహర్షి ఆశ్రమంలో నిత్యం

వేదపారాయణం వింటున్న పక్షిజాతులకుకూడా వేదోచ్చారణ అబ్బినట్టుగా, లలిత లలిత సంగీతంతో పశుపక్ష్యాదులు కృష్ణుని వేణువాదంతో ఎంతగా పరవశించాయో అంతకన్నా మిన్నగా వివశమయ్యాయి. అచ్చటి నిశ్శబ్ద ప్రకృతి వాతావరణం ఇంకా నిశ్శబ్దమై పోయేది. సెలయేటి ప్రవాహం తాళం వేస్తుండగా, అలా ఎంతసేపటివరకు పాడుకునేదో ఆమెకే తెలిసేదికాదు. ఒక్కోమారు వెన్నెల రాత్రయితే ఇంటికి వచ్చేసరికి అర్ధరాత్రమయేది.

తల్లి ఏమీ అనేదికాదు. లలితకు సర్వస్వతంత్రాలూ ఇచ్చింది. లలిత జ్ఞానవంతురాలు; వివేకిని. ఇంకా అగ్నికున్న పవిత్రత ఆమెకుంది. ఆమెకే అన్ని విషయాలూ తెలుసు. ఇక తాను చెప్పవలసిందేమీ ఉండదన్నట్టుగా ఊరుకొనేది. కాని, ఊళ్లో రకరకాలైన పుకార్లుమాత్రం లేకపోలేదు.

ఒక రోజు యథావిధిగా సెలయేటి ఒడ్డున నల్లరాతిమీద కూర్చొని భావాతీతమైన శూన్యంలోకి చూస్తూ, కాళ్లు నీళ్లల్లో ఆడిస్తూ ఒక ఆలాపన పూర్తి చేసింది లలిత.

అంతలో నిర్మలాకాశం నీలమేఘావృతమై పోయింది. చెట్లమీద పక్షులన్నీ ఒక్కమారుగా కిలకిలారావాలతో పైకెగిరిపోయినాయి. చెట్లు గాలికి అల్లల్లాడినాయి. లేళ్ళు, కుందేళ్లు పరుగులెత్తినాయి.

లలిత కిది సరికొత్త అనుభవం. ఇన్నినాళ్లుగా ఇటువంటి సంఘటన ఏదీ తటస్థించలేదు. ఈ రోజేదో వింత జరగబోతుందనుకొంది. అనుకొనేంతలోనే గాలి వడిగా వీచసాగింది. ఆ గాల్లో తేలివచ్చే కాగితాన్నొకటి చేతికందుకొంది.

అప్పుడే మొదలుపెట్టిన వాన చినుకులతో కాగితంమీద అక్షరాలు తడిసి అల్లుకుపోయినాయి. మొదటి రెండు వాక్యాలు (వాక్యాలు కావవి చరణాలు) మాత్రం అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నీ కరుణ కిరణాల నీరధిలోన
జలకమాడగా చవులూరుదునే."

అదో పాట. చుట్టూ కలయచూసింది. ఎవరూ కన్పించలేదు. గాలి కెదురుగా ఒడ్డునే పరుగెత్తింది. ఒక చోట కాగితాల బొత్తి కనిపించింది. ఆమె ఆశ్చర్యానికి అంతులేకపోయింది. కాగితాలు చాలవరకు తడిసిపోయినాయి. విప్పి చూసింది. అంతాచేతి వ్రాతతో నిండిన కాగితా లవి.

ఏరు ఉన్నట్టుండి పెల్లున పొంగింది. కాలికొద్దీ పరుగెత్తింది లలిత. కాని అంతకుముందే నీటి ప్రవాహం ఆమెను చుట్టేసింది. ఆ ప్రక్కనే ఎత్తుగా ఉన్న రాతిమీది కురికి నిలబడింది. "హమ్మయ్య!" అని గుండె దిటవు పరుచుకొంది. ఆ రాయి ప్రక్కనే నీళ్లల్లో ఒక మానవాకారం కనిపించింది బుడగలేస్తూ. ఒళ్లంతా జలదరించగా, భయంతో గుండె దడదడలాడింది. అప్పటికే సూర్యాస్తమయమై పోయింది.

ధైర్యం తెచ్చుకొని, ఆ మానవాకారాన్ని ఎలాగైతేనేం రాతిమీదకు చేరవేసింది. ఆ శరీరంలోని ఉచ్ఛ్వాస నిశ్వాస లాగిపోలేదు. ప్రాణమున్నట్టుగానే గోచరించింది. తనకు తెలిసి ఉన్నంతలో ప్రథమ చికిత్స చేసి, ఎవరినైనా వైద్యుని పిలిస్తే బాగుండుననుకొంది. కాని, ఇప్పుడు తనేమీ చేయలేదు. తానిప్పుడు ఏం చేద్దామనుకున్నా అరణ్యరోదన మవుతుంది. భగవంతుడిని ప్రార్థించడం తప్పితే గత్యంతరం కనిపించలేదు. ఆ ఉన్నాడనుకున్న భగవంతుడిని ప్రార్థించింది. కరుణతో కాపాడమని కోరుకుంది.

మానవాకారం కోలుకుంది. తల ఆడించింది. అప్పటికిగాని లలితకు ధైర్యం చిక్కలేదు. నఖశిఖ పర్యంతం పరీక్షించి తన ఊరివాడు కాకపోవడంతో పరదేశిగా నిర్ణయించుకొంది. శుష్కించిన శరీరం, పాలిపోయిన రంగు, ఎక్కడో లోతుగా ఉన్నాయా, లేవా అనిపిస్తూ కూరుకుపోయిన కళ్ళు, మాసిన గడ్డం, చిరిగిన వస్త్రాలు — ఇదీ అతని అవతారం. రూపే భయంకరంగా ఉంది. చూడగానే, అతనికి సుమారుగా ఏభయ్యేళ్లుండవచ్చనుకొంది. కాని, చూడగా చూడగా అలా కన్పించలేదు. ముప్పయి యేళ్లకన్నా ఎక్కువ ఉండవు. అంతులేని బాధ, ఆవేదన కళ్లల్లో కాపురమున్నట్టుగా అతని చూపులు చూపుతున్నాయి. అతను స్పృహలోకి వచ్చాడు. వెర్రిగా చూశాడు. "నేను బ్రతికాను. ఇంకా బ్రతికాను" అనే మాటలు అస్పష్టంగా అతని నోటినుంచి వెలువడినాయి. మరి అతను మాట్లాడలేదు. కళ్లు మూసేశాడు. లలిత భయంకరంగా అరిచింది.

తాను ఎరిగిఉన్న తర్వాత చావు చూడడమిదే మొదటిసారి. అందులోనూ ఈ వ్యక్తి తన చేతుల్లో మరణించాడు. ఆమెలో భయంకన్నా అతనిమీది అనురాగపూరితమైన జాలి, దయతో కూడిన బాధ ఎక్కువయాయి. నిజంగా తనకు, అతనికి ఎటువంటి బాంధవ్యంలేదు. పరిచయం లేదు. ఐనా ఎందుకో ఎప్పటిదో ఆత్మీయతానుబంధం తన్ను పెనవేసుకొంది. హృదయావేదనను భరించుకోలేకపోయింది లలిత. అతని శుష్కశరీరాన్ని, తీరును చూసి గుండె కరిగిపోయింది. వచ్చే ఏడుపు ఆపుకోలేక అతని మీద పడి ఏడ్చింది. ఎంతవరకు ఏడ్చిందో, ఏమో!

కళ్లు తెరిచేటప్పటికి తన యింట్లో మంచం మీద ఉంది. ప్రక్కనే తల్లి, మరోప్రక్క డాక్టరు. ఎంతో ఆశ్చర్యపోయింది. విచిత్రమైన కలగన్నానేమో అనుకొంది. కాని, అలా కాలేదు. ఎదురుగా బల్లమీదఉంచిన కాగితాల కట్ట అపరిచిత బాంధవుడిని గుర్తెరిగించింది. ఉలిక్కిపడి లేచి కూర్చుంది. డాక్టరు తల్లిదగ్గర సెలవుతీసుకు వెళ్లిపోయాడు.



నీటికోసం
చిత్రం—జి. కృష్ణమూర్తి (నిజామాబాద్)

"ఎవ రతను?" ప్రశ్నించింది తల్లి.

లలిత కేమీ అర్థంకాలేదు.

"ఎవ రతను?" మళ్లీ రూక్షారుణ నయనాలతో గట్టిగా అడిగింది.

లలిత వెర్రిగా చూసి, చిన్నగా నవ్వుకొని "డాక్టరు" అంది.

"డాక్టర్ని కాదు నే నెవరూ అని అడిగింది? నిన్న నీవు ఎవరితో గడిపేవో, వాడు. వా డెవడు?" నొక్కి ప్రశ్నించింది.

ఇక తల్లి మాటలు వినిపించకుండా రెండు చెవులూ గట్టిగా మూసుకుంది లలిత. తన కన్నతల్లేనా యిలా మాట్లాడేది అని అవమానంతో క్రుంగిపోయింది. ఏమి జరగబోతుందో నన్న భయంతో తల్లి ముఖంలోకి చూస్తూ తల్లడిల్లిపోయింది.

"ఎన్నాళ్లనుంచి సాగుతోందీ భాగోతం?"

తల్లి అమాయకత్వం ఆ ప్రశ్నలో వ్యక్తమైంది. లలిత నవ్వింది విషాదంగా. ఆ నవ్వులో ఎంతో పవిత్రత ఉంది. దానిలోని పవిత్రతను ఆ తల్లేకాదు, ఎవరూ అర్థం చేసుకోలేరు.

"కుటుంబ మర్యాదంతా గంగలో కలిపావు. వంశానికి తీరని అపచారం చేశావు. నీవల్ల యిప్పటికే వంశానికి కళంక మేర్పడింది. మానం, మర్యాద ఏమన్నా ఆలోచించే చేశావా యీ పని?" కుటుంబ గౌరవ మర్యాదలకు అప్రతిష్ఠ వాటిల్లిన ఆవేదన ఆమె ప్రతి మాటలోనూ యిమిడి ఉంది.

"ఏంచేశాను నేను? నే చేసిన పాపమేమిటి? నేనేం తప్పు చేశాను?" ఆర్ద్రమైన నయనాలతో పొడారిన కంఠంతో అడిగింది లలిత.

"నువ్వా...? నువ్వేం చేసేవో, ఏం తప్పు చేసేవో నన్నడుగుతున్నావా? ఊళ్లో ఎవర్నడిగినా చెబుతారు. అందరి కళ్లల్లోనూ పడ్డావు... నీ గూర్చి నేనెన్నో బంగారు సౌధాలు నిర్మించుకున్నాను. వాటినన్నిటినీ గాలిమేడలు చేశావు. నిన్ను నమ్ముకున్న నన్ను మోసం చేశావు. రేపటినుంచి బయట తలెత్తుకు నెలా తిరగను?" ఇంకా ఆవేశంగానే మాట్లాడేస్తున్నది తల్లి.

ఆమె నెలా ఓదార్చాలో, తనేమీ తప్పు చేయలేదని ఆమెకు ఎలా తెలియపరచాలో తెలియలేదు. అందుకే ఆమె మాట్లాడలేదు. చేతులతో ముఖాన్ని కప్పుకు ఏడ్చింది. విచిత్రమైన ప్రపంచాన్ని చూసి విస్తుపోయి వాపోయింది లలిత.

కన్న హృదయం కరిగింది.

"వాడితో ఏంచూసుకు మురిశావమ్మా....? నీకీబుద్ధి ఎలా పుట్టిందమ్మా....?" కళ్ళు ఒత్తుకుంటూ లలిత తలనిమిరింది తల్లి.

నిలాపనిందమపాసి భరించుకోలేకపోయింది లలిత.

"నే నే పాపం చేయలేదమ్మా.... అతనెవరో నాకు నిజంగానే తెలియదమ్మా. నామాట నమ్ము. నామాట నమ్మమ్మా....." అంటూ భోరున ఏడ్చింది.

"నాకు తెలుసమ్మా. ఇదిలోకం. దానికి సరిపోయిన వారే యీ ప్రజలు. ప్రత్యక్షసాక్ష్యంగా కనిపించిన దృశ్యాన్ని చూశారు. వాళ్ళే నీవెవరిమీదో వ్యామోహంతో పడిపోయిఉన్నావని నాతో చెప్పారు. నేనూ నది ఒడ్డుకు వచ్చి చూశాను. దీన్ని నే నెలా కాదన్ను? నేను కాదంటేమాత్రం వినే దెవరు?"

కనీసం తల్లి మనసులోనైనా మంచి అభిప్రాయమున్నందుకు కొంత ఓదార్పే కలిగింది. ఈ విషయం మర్నాటికల్లా గ్రామాలవెంట చిలవలు పలవలుగా పెరిగి కథలుగా ప్రాకిపోయింది. లలితకు లోకంమీద, ప్రజలమీద నిర్వ్యామోహభావ మేర్పడింది. జీవితంమీద విరక్తి పుట్టింది. మనుషులమీద మమకారం నడలిపోయింది. బాంధవ్యాలు, స్నేహసాన్నిహిత్యాలు త్రెంచేసుకుంది. విరాగినిగా అనిమిత్తురాలై పోయింది.

ఎంత మరిచిపోదామనుకున్నా సెలయేటి వెన్నెల, నదిలో నల్లరాయి, నల్లరాతిమీద తాను, అపరిచితుడు, అతనిచావు, ప్రజల నింద—మళ్ళీ మళ్ళీ గుర్తుకు వస్తున్నాయి. తన కళ్ళముందీ చరిత్ర తప్పితే మరేదీ కనిపించదు. నిత్యం అదే ఆలోచన. అదే ఆవేదన. అదే బాధ.

అతని పేరేమిటో, ఊరేమిటో తెలియదు. అతనిమూలంగానే తన జీవితానికి కళంక మేర్పడింది. అయినా అతనిమీద కోపంలేదు. అతన్ని తలుచుకుంటే గుండె కరిగిపోతుంది. అతనిగూర్చి తెలుసుకోవాలని కాగితాల కట్టను విప్పి చూసింది. ప్రతి పుటలోనూ ఒక పాట. మధురమైన గీతం. పాట ప్రతి పాదంలోనూ అతని ఆవేదన, ఆవేశం, లోకంమీద విరక్తిభావం నివేదింపబడి ఉన్నాయి. ప్రతి అక్షరంలోను జీవితంమీద అసహ్యం, బాధ అంతర్గతమై ఉన్నాయి. అతడొక మహాకవి. పేరూ ఊరూ లేని అజ్ఞాతకవి. నిరాడంబర బాధామయజీవి.

అన్నిపేజీలు తిరగేయగా, పాటలు, గీతాలు చదివినతర్వాత అతను ఆత్మహత్య చేసుకున్నట్టు రూఢయ్యింది. దానికి చాలా ఆధారా లున్నాయి. కాని అతనిపేరూ, ఊరూ మాత్రమే మృగ్యం.

అప్పటినుంచి లలితకు ఒకేదీక్ష, ఒకే పని. సంగీతంలో తన రాగంలో అతని కవిత్వాన్ని మేళవించి సాధించడం. అదే ఆమెకు అత్యంతానందం, సంతోషం, సర్వసౌఖ్యాలూను. అంతేకాదు. అతని పాటలు తప్పితే మరో అక్షరం ఆమె నోట వినబడగా ఎవరూ వినలేదు.

# పతిత

ఆమె మూగబాధ నర్థం చేసుకొనే వారెవరూ లేరు. ఆ అర్థం చేసుకోలేని వారితో ఆమెకు ప్రమేయం లేదు. ఒక పవిత్ర ఆదర్శానికి, ఆచరణకు కళంకంకూర్చిన లోకంతో తనకుసంబంధమూ లేదు. నిర్దోషులను దోషులుగా వేలెత్తి చూపించే యీ సంఘ పరిసరాలతో నిమిత్తం లేకుండా, జోక్యం కలిగించుకోకుండా ఉండాలనుకుంది. ఎవరితోనూ మాట్లాడదు. చివరకు తల్లితో కూడా. అన్నాహారాలు తల్లి బలవంతంమీద ముట్టుకునేది. ఎప్పుడూ ఆ సెలయేరు—నల్లరాయే ఆమె నివాసం.


ఆమె పవిత్ర నిరపరాధతత్వం ఎవరికీ తెలియదు. సత్యాన్ని తెలుసుకోలేకపోయారు. వివక్షతాజ్ఞానం నశించింది. లోకం దృష్టిలో ఆమె పతిత.

ఎంతోకాలంనుంచి లలితకు, ఆ చనిపోయిన వాడికి సంబంధం ఉందని, అతని చావుకు కూడా కారణం లలితేనని, ఆ పాపం పోయేందుకే మౌనవ్రత మవలంబించి పిచ్చిదానిలా తయారైందని ఆ గ్రామంలో వదంతి.

ఇలా అనుకుంటున్నారని లలితకు కూడా తెలుసు. రానురాను మొద్దుబారిపోయింది హృదయం.

సెలయేటి ఒడ్డున, ఆ రాతిమీద కూర్చుని అజ్ఞాతకవి పాటను పాడడంలో తన్మయురాలయి, రాగాలాపనలో నిమగ్నురాలయి నిద్రాహారాలు మానేస్తుండేది. గాలితో తేలివచ్చే రాగాలాపన విన్న గ్రామవాసులు వారివారి పనులు చేసుకోవడం మరిచిపోయేవారు. మానేసి అలానే నిశ్చేష్టులై పోయేవారు. మరుక్షణంలోనే తేరుకుని అజ్ఞానంలో పడి ఒక పతిత నోటినుంచి కదా యీ పాట వినబడేది అని లలితను దూషించేవారు. చాలమంది స్త్రీలు—చిన్న, పెద్ద—సెలయేటి ఒడ్డున కూర్చుని లలిత గానాన్ని విని చెవులపండుగ చేసుకొనేవారు. అంతకంతకు ఇరుగు పొరుగు గ్రామాలనుండి వచ్చేపోయే జనంతో అదో తీర్థంగా మారిపోయింది.

లలిత అంతకంతకు చిక్కి శల్యమైపోతున్నది. నిద్రాహారాలు బొత్తిగా మానివేసింది. ఇంటికి రావడమెప్పుడో విరమించుకొంది. అజ్ఞాత కవి గీతాలు, తాను ఒకటై ఆలపిస్తూ, అవే తనకు సర్వస్వమని ఎంచుకు కాలం



హాలికుడు
చిత్రం—జి. ఆదినారాయణరెడ్డి (మదనపల్లి)

గడుపుతున్నది.

ప్రజలు ఆమెను చూడ్డానికి వచ్చినప్పుడు చాలా అస్వస్థతగా భావించేది. తాను ఏ ఉద్దేశ్యంతో ఏ ప్రశాంత వాతావరణాన్ని నమ్ముకొని వచ్చిందో, ఇప్పు డది నెరవేరటంలేదు. రుచించడం లేదు. జనుల రాకపోకలు నిర్మల వాతావరణానికి ఆటంకమవుతున్నవి.

ఒక పతితను, పిచ్చిదాన్ని చూసేందుకు యీ ప్రజలు తండోపతండాలుగా ఎందుకు వస్తున్నారో ఆ గ్రామంలోని కొందరు మూతలకు బోధపడలేదు. గ్రామానికి అప్రతిష్ఠ, కీడు అంటూ సణుక్కున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే గ్రామంలోని స్త్రీలందరూ పాడైపోతారని తీర్మానించుకున్నారు. గుమిగూడి సమాలోచనలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు. లలిత పిచ్చి మరే యితర స్త్రీలకు అంటకూడదని, ఆ 'పతిత' ను అంతమొందించాలని ఒక రాత్రి ముహూర్తం చూసుకొని నది ఒడ్డుకు బయలుదేరారు.

అనాటికే లలిత అజ్ఞాత కవి కవిత్వంలోని ప్రతి పాటనూ వల్లెవేసింది. ప్రతి అక్షరానికి మధురమైన రాగం కూర్చింది. ఇక మిగిలిపోయిన పాటలో మొదటి రెండు చరణాలూ అందుకుంది.

'నీ కరుణ కిరణాల నీరధిలోన
జలకమాడగా చవులూరుదునే...

సాధనసామగ్రితో వచ్చిన కాబోయే హంతకులు ఆ పాట విని ముగ్ధులైపోయారు. ముందడుగు వడలేదు. ఈమెనా అంత మొందించేది? ఈమె తపస్విని రూపంలో ఉన్న దేవతకాక మరోటి కాదనుకున్నారు. వెనుదిరిగారు పశ్చాత్తప్త హృదయాలతో, వాళ్ళ పాపభూయిష్ఠమైన తలపుకు మరి పరిహారం లేదనుకుంటూ.

అంతలోనే గాలివాన విజృంభించసాగింది. వింత పరిణామానికి చుట్టుపట్ల గ్రామవాసులు ఆశ్చర్యచకితులై భయభ్రాంతులైపోయారు. అంత గాలివానలోనూ లలిత లలిత సంగీతం వినిపిస్తున్నది. అందరూ చైతన్యరహితులైపోయారు. గ్రామం గ్రామమంతా నది దగ్గరికి మంత్రముగ్ధుల్లా పరుగెత్తుకువచ్చారు.

ఆ రాగాలాపనా మృదుమధురత్వానికి అక్కడున్న నల్లరాతిబండలు కరిగిపోతూనే ఉండవచ్చు. సెలయేరు పెద్దపెట్టున పొంగింది. ఉరకలు వేసుకుంటూ మహాప్రళయంగా పొంగింది. అయినా లలిత పాట వినిపిస్తూనే ఉంది. జనులందరూ విభ్రాంతితో కళ్ళు మూసుకున్నారు. మరికొంత సేపటికి ఏరు ఎప్పటిలా అయిపోయింది.

ఆ తర్వాత లలిత కనిపించలేదు. జ్ఞానులయ్యారు ప్రజలు. అజ్ఞానాంధకారం నుంచి విముక్తులై నిజం తెలుసుకున్నారు.

లలిత నిత్యం కూర్చుని పాడుకున్న నల్లరాతి బండమీద ఆలయాన్ని నిర్మించారు. ఇప్పుడామె నొక దేవతగా ఆరాధిస్తున్నారు. ఎవరినోట విన్నా ఆమె పాడిన పాటలే వినిపిస్తున్నాయి. ★